క్లుప్తంగా

ఆర్టీసీ బస్సు ప్రయాణంపై అవగాహన

మాచర్ల: ప్రైవేటు వాహనాలను నియంత్రించి, ఆర్టీసి బస్సులో ప్రయాణికులు వెళ్లేలా చైతన్యం చేస్తూ డీఎం బత్తుల వీరాస్వామి ఆధ్వర్యంలో ఆర్టీసీ ఉద్యోగులు ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. సోమవారం బస్టాండ్ సమీపంలోని నర్సరావుపేట, గుంటూరు వెళ్లే రహదారుల వద్ద ప్రయివేటు వాహనాలు ఆగకుండా చూసి, ఆర్టీసీ బస్సుల్లో ఎక్కాలని ప్రయాణికులకు సూచనలు చేశారు. ఆర్టీసి ప్రయాణం సురక్షితమంటూ ప్రచారం నిర్వహించారు. పోలీసు శాఖ వారికి సహకరించింది.

గుడ్ మార్నింగ్ మాచర్ల



మాచర్ల: గుడ్ మార్నింగ్ మాచర్ల కార్యక్రమంలో భాగంగా సోమవారం మున్సిపల్ చైర్మన్ పోలూరి నరసింహారావు 15వ వార్డులో పర్యటించారు. పలు ప్రాంతాల్లో డ్రెయిన్లు పూడి పోయిన విషయాన్ని స్థానికులు ఆయన దృష్టికి తీసుకొచ్చారు. దీంతో పారిశుద్ధ్య కార్మికులతో పనులను చేపట్టారు. పైపులైన్ పగిలి నీరు వృథాగా పోతుంటే మరమ్మతులు చేయించారు. మరో రెండు వార్డుల్లో పర్యటించి, స్థానికుల సమస్యలు తెలుసుకున్నారు.

2 నుంచి ఉచిత శిక్షణ తరగతులు

మాచర్ల : పట్టణం రామకృష్ణా సేవా సమితి ఆధ్వర్యంలో ఉచిత పాలిటెక్నిక్, ఏపీఆర్జేసీ ఎంట్రెన్స్ కోచింగ్, స్పోకెన్ ఇంగ్లీష్ తరగతులు ప్రారంభించనున్నట్లు సమితి అధ్యక్షుడు మెట్టు గోవిందరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏప్రిల్ 2 నుంచి 24వ తేదీ వరకు ఉదయం 8 నుంచి 10, సాయంత్రం 5 నుంచి 7 గంటల వరకు.. శ్రీశైలం రోడ్డులోని స్వామి వివేకానంద సేవా శ్రమంలో ఉచిత కోచింగ్ సెంటర్ ఏర్పాటు చేస్తామన్నారు. ఈ అవకాశాన్ని 10వ తరగతి పరీక్షలు పూర్తి చేసిన విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వివరాలకు 94400 06813, 93461 628354 సంప్రదించాలని పేర్కొన్నారు.

నేటి నుంచి ప్రత్యేక ఆధార్ క్యాంపులు

మాచర్ల: మాచర్ల పురపాలక సంఘం ఆధ్వర్యంలో ఆధార్ ప్రత్యేక క్యాంపులు ఈ నెల మంగళవారం నుంచి ఈ నెల 28 వరకు నిర్వహిస్తున్నట్లు కమిషనర్ డి.వేణుబాబు సోమవారం తెలిపారు. వడ్డెరబస్తి, నెహ్రూ నగర్ సచివాలయాల్లో ప్రత్యేక ఆధార్ క్యాంపులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రజలందరూ ఆధార్ సంబంధిత సేవలను సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు.

వైభవంగా వీర బ్రహ్మేంద్రస్వామి కల్యాణోత్సవం



మాచర్ల రూరల్: శ్రీ మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి కల్యాణ మహోత్సవం కొత్తపల్లి గ్రామంలో సోమవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. అర్చకులు శ్రీనివాసాచారి స్వామి వారి విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. ఆలయ వంశపారంపర్య ధర్మకర్త అల్లం కోటిరెడ్డి నేతృత్వంలో నిర్వహించిన కార్యక్రమంలో మేడం వెంకటేశ్వర్లు, శంకరరెడ్డి పూజలు చేశారు. స్వామి వార్లను ప్రత్యేకంగా అలంకరించి పుర వీధుల్లో మేళతాళాలు, కోలాటాల మధ్య ఊరేగింపు నిర్వహించారు. అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.

ఆర్వోబీ నిర్మాణానికి చర్యలు



దాచేపల్లి : కేసానుపల్లి రైల్వేగేట్ వద్ద ఆర్వోబీ(రైల్వే ఓవర్ బ్రిడ్జి) నిర్మాణానికి చర్యలు తీసుకున్నట్లు ఆర్డీవో మురళీకృష్ణ అన్నారు. కేసానుపల్లి రైల్వేగేట్తో పాటుగా ఆర్వోబీ నిర్మాణం చేసే ప్రాంతాలను సోమవారం ఆయన పరిశీలించారు. నిర్మాణానికి సంబంధించి ఆక్రమణాలు, ప్రభుత్వ భూములను ఆరా తీశారు. ఆర్వోబీకి కేంద్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందని, త్వరలోనే పనులు ప్రారంభించేందుకు సంబంధిత అధికారులు చర్యలు తీసుకుంటారని ఆర్డీవో మురళీకృష్ణ చెప్పారు. ఆర్డీవో వెంట తహసీల్దార్ కేవీ. కుటుంబరావు, ఆర్ఐ శరత్కుమార్, సర్వేయర్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

వేసవి కాలం..

పశువులు జరభద్రం

పశువులకు వడదెబ్బ ముప్పు
లక్షణాలు గుర్తిస్తే క్షేమం

దాచేపల్లి : వేసవిలో మూగజీవాల పట్ల నిర్లక్ష్యం చేస్తే తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుంది. పశువులకు వడ దెబ్బతగిలే అవకాశాలు మెండుగా ఉన్నాయి. ఈ ప్రభావంతో పాల దిగుబడి గణనీయంగా తగ్గడమే కాకుండా, ప్రాణప్రాయ పరిస్థితులనూ మూగజీవాలు ఎదుర్కోవాల్సి వస్తుంది. పశువుల శరీర ఉష్ణోగ్రతల కంటే బయటి ఉష్ణోగ్రత అధికమైనప్పుడు మెదడులోని హైపోథలామస్ స్వేదగ్రంథులు నిర్వహణపై పర్యవేక్షణ కోల్పోతాయి. చెమట ద్వారా శరీరంలోకి ఎలక్ట్రోలైట్స్ కోల్పోయి శరీర ప్రక్రియ మందగిస్తుంది. దీని వల్ల శరీర ఉష్ణోగ్రత పెరుగుతుంది. శ్వాస, గుండె, నాడీ వేగం పెరుగుతుంది. దీంతో పశువులు అపస్మారక స్థితిలోకి వెళ్లి శ్వాస తీసుకోవడం ఇబ్బందిగా మారి ప్రాణాలు పోయే ప్రమాదం ఉంది. వేసవిలో తగు జాగ్రత్తలు తీసుకుంటే పశువులను రక్షించుకోవచ్చు.



మూగజీవాల సంరక్షణపై అవగాహన కల్పిస్తున్న పశువైద్యాధికారులు

జాగ్రత్తలు తీసుకోకుంటే ప్రమాదమే..

దాచేపల్లి మండల పరిధిలో 12,061 పశువులు, 19,357 గొర్రెలు ఉన్నాయి. వడ దెబ్బ తగిన ఆవుల్లో శరీర ఉష్ణోగ్రత 103 డిగ్రీల సెల్సియస్ మించుతుంది. చర్మ మృదుత్వం తగ్గిపోయి గట్టిపడుతుంది. నోటితో గాలి పీల్చుకోవడం, నోటి వెంట చొంగ కారటం జరుగుతుంది. ఆవుల్లో పాలదిగుబడి, పునరుత్పత్తి, చూడుకట్టే శాతం తగ్గి గర్భ స్రావం అయ్యే అవకాశం ఉండగా.. ఎద్దుల్లో వంధత్వం వస్తుంది. తీవ్రత ఎక్కువ అయినప్పుడు పక్షవాత లక్షణాలు సంభవించి క్రమంగా కోమాలోకి వెళ్లి మృత్యువాతపడతాయి.

చికిత్స విధానం

వడదెబ్బకు గురైన మూగజీవాలను వెంటనే నీడ ప్రాంతానికి చేర్చాలి. అవకాశం ఉంటే ఫ్యాన్లు, కూలర్ల ద్వారా చల్లని గాలి అందించాలి. బాగా ఎండగా ఉన్న సమయాల్లో పశువులను చల్లని నీటితో శుభ్రం చేయాలి. చల్లని నీరు తాగటానికి అందుబాటులో ఉంచి నొప్పులను తగ్గించడానికి నివారణ(అనాల్జేసిక్) మందులను వాడాలి. రక్తంలోకి డెక్స్ట్రోజ్ సైలెన్, లవణ ద్రావణాలు ఎక్కించాలి.

నివారణ చర్యలు

వేసవిలో పశువులను ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 3 గంటల మధ్య మేతకు బయటకు తీసుకెళ్ల కూడదు. చల్లని తాగునీరు అందుబాటులో ఉంచాలి. రోజుకి 4-5సార్లు చల్లని నీటితో కడగడం లేదా చెరువులు, కుంటలు ఉన్న చోట నీళ్లలోకి వదిలిపెట్టాలి. పశువుల కొట్టాలను ఎత్తుగా నిర్మించుకుని పైన ఎండిన గడ్డితో కప్పి, నీళ్లు చల్లుతూ ఉండాలి. పశువుల పాకల్లో వడగాలి వస్తున్న దిక్కుల్లో గోనె సంచులు కట్టి నీళ్లు చల్లుతుండాలి. నీటిశాతం ఎక్కువగా ఉన్న పచ్చిగడ్డి, పాతర గడ్డి, హైడ్రోఫోనిక్స్ గడ్డి పెట్టాలి. ఎక్కువగా దాణా, ఉడికించిన ధాన్యాలు పెడుతున్నప్పుడు కొంచెం వంట సోడా కలపడం వల్ల ఎండ ధాటికి గురైన పశువుల్లో వచ్చే అజీర్తి సమస్యలు నివారించవచ్చు.

వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు తీసుకోవాలి



వేసవిలో మూగజీవాలు వడదెబ్బబారిన పడే అవకాశాలు ఉంటాయి. వడదెబ్బ తగిలితే తక్షణమే చల్లని ప్రదేశానికి తరలించాలి. వడదెబ్బ తగిలిన పశువులకు మెరుగైన ఉచిత వైద్యం అందిస్తాం. మధ్యాహ్నం సమయాల్లో మూగజీవాలను బయటకు విడిచిపెట్టవద్దు. రోజుకి ఐదుసార్లు మూగజీవాలను శుభ్రం చేయడం మంచిది. ముందు జాగ్రత్తలు తీసుకుంటే మూగజీవాలు వడదెబ్బ బారిన పడకుండా కాపాడుకొవచ్చు.

– నార్ల చెన్నయ్య, మండల పశువైద్యధికారి, దాచేపల్లి

సమష్టిగా తిరునాళ్లు విజయవంతం చేద్దాం

శావల్యాపురం: ఉగాది పర్వదినం రోజున ఈనెల 30న మండలంలోని బొందిలిపాలెంలో వేంచేసియున్న శ్రీఅడవి పేరంటాళ్ళ అమ్మవారి తిరునాళ్ల వేడుకలు సందర్భంగా ప్రజాప్రతినిధులు, అన్నీ శాఖల అధికారుల సమన్వయంతో విజయవంతం చేయాలని తహసీల్దారు కె.సుజాత కోరారు. సోమవారం అడవి పేరంటాళ్ళమ్మ అమ్మవారి దేవాలయాన్ని సందర్శించి, తిరునాళ్ళ ఏర్పాట్లుపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నియోజకవర్గంలో ప్రసిద్ధి చెందిన తిరునాళ్లకు వేల సంఖ్యలో భక్తులు విచ్చేసి అమ్మవారిని దర్శించుకుంటారన్నారు. పంచాయతీ తరుపున శానిటేషన్ పనులు చేయించటంతో పాటు రెండు మంచినీటి ట్యాంకులు ఉదయం నుంచి దేవాలయం ప్రాంగణంలో ఉంచాలన్నారు. తిరునాళ్ల వేడుకల్లో ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి వేసవి కాలం కావటం చేత వోఆర్ఎస్ ద్రావణం ప్యాకెట్లు ఆరోగ్య కార్యకర్తలు పర్యవేక్షణ చేయాలన్నారు. క్యూలైన్లోని భక్తులు ఇబ్బందులు పడకుండా దేవదాయశాఖాధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేయాలన్నారు.



సమావేశంలో పాల్గొన్న అధికారులు

ఎస్ఐ లేళ్ళ లోకేశ్వరరావు మాట్లాడుతూ ట్రాఫిక్ నిబంధనల మేరకు మూడు పార్కింగ్ స్థలాలు కేటాయించామని, తిరునాళ్ల నేపథ్యంలో మహిళ భక్తులు బంగారు ఆభరణాలు పట్ల పలు రకాల జాగ్రత్తలు పాటించాలన్నారు. విద్యుత్ ప్రభలు నిర్వాహకుల ముందుస్తుగా పోలీసు అనుమతులు పొందాలన్నారు. ఈ సదస్సులో పంచాయతీ కార్యదర్శి బాల పరమేశ్వరరావు, మాజీ సర్పంచ్ బత్తుల వెంకటేశ్వర్లు, దేవదాయశాఖాధికారి యం.సుధాకర్రెడ్డి, ఏఈ జవ్వాజీ నటరాజ్ గ్రామస్తులు పాల్గొన్నారు.

దడ పుట్టిస్తున్న వంతెన



పంచాయతీ కార్యాలయం వద్ద ప్రమాదకరంగా ఉన్న బ్రిడ్జి

పెదకూరపాడు: స్థానిక ప్రధాన రహదారి (పంచాయతీ కార్యాలయం)పై బ్రిడ్జి నిర్మించి నాలుగు దశాబ్దాలు గడిచింది. పూర్తిగా శిథిలావస్థకు చేరింది. ఈ రహదారిలో నిత్యం వందలాది వాహనాలు తిరుగుతుంటాయి. ముఖ్యంగా ఆర్టీసీ, పాఠశాల బస్సులు, పాల వాహనాలు, లారీలు, ట్రాక్టర్లు లాంటి భారీ వాహనాలతో ఎప్పుడు ఏ ప్రమాదం చోటు చేసుకుంటుందో తెలియని పరిస్థితి. ఇటీవల రహదారిని విస్తరించి సీసీ రోడ్డు కూడా వేశారు. దీంతో భారీ వాహనాల సంఖ్య పెరిగింది. అధికారులు భారీ వాహనాలను నియంత్రించి ప్రమాదాలు జరగకుండా చూడాలని గ్రామస్తులు, ప్రయాణికులు వేడుకుంటున్నారు. వంతెన నిర్మాణం చేపట్టాలని కోరుతున్నారు.

బైపాస్ వంతెన వద్ద రోడ్డు ప్రమాదం

కనిగిరి యువకుడి దుర్మరణం



యడ్లపాడు: రోడ్డు దాటుతున్న ఫోర్వీల్ ఆటోడ్రైవర్ను గుర్తు తెలియని వాహనం ఢీకొని అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన మండలంలో హైవే బైపాస్ వద్ద జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ప్రకాశం జిల్లా కనిగిరి మండలం కూచిపూడిపల్లి గ్రామానికి చెందిన బత్తుల యాగయ్య ఫోర్వీల్ టాటాఇంట్రా వాహనంలో గుంటూరు నుంచి కనిగిరికి ఇంటి సామాన్ల లోడుతో ఆదివారం రాత్రి బయలుదేరాడు. మండలంలోని తిమ్మాపురం హైవే బైపాస్ ఎక్కగానే ఫోర్వీల్ వాహనం అదుపుతప్పి ముందు వెళ్తున్న కారును వెనుక నుంచి ఢీకొంది. దీంతో కారు యజమానితో డ్రైవర్ యాగయ్య మాట్లాడి తిరిగి తన వాహనం వద్దకు వస్తున్న క్రమంలో.. అదే సమయంలో అటువైపు దూసుకువచ్చిన గుర్తు తెలియని వాహనం యాగయ్యను ఢీకొంది. దీంతో తలకు తీవ్ర గాయాలైన యాగయ్య (23) సంఘటనా స్థలంలోనే మృతి చెందాడు. స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న మృతుని తల్లిదండ్రులు ఏడుకొండలు, వరమ్మ, బంధువులతో యడ్లపాడుకు చేరుకున్నారు. తల్లి వరమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. మృతదేహాన్ని చిలకలూరిపేట ప్రభుత్వ ఆసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు.

నేడు డయల్ యువర్ డీఎం

సత్తెనపల్లి: ప్రయాణికుల సమస్యల పరిష్కారానికి, సలహాలు, సూచనలు అందించేందుకు మంగళవారం డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు సత్తెనపల్లి ఆర్టీసీ డిపో మేనేజర్ జి.ఎస్.వి.వి.కుమార్ తెలిపారు. మంగళవారం ఉదయం 11 గంటల నుంచి 12 వరకు జరుగుతుందని పేర్కొన్నారు. ఆర్టీసీ ప్రయాణికుల సమస్యలు, మెరుగైన సేవలకు 9959225429 నంబరులో సంప్రదించాలని ఆయన సూచించారు.

చెత్త నుంచి పంచాయతీలకు అదనపు సంపద

నాదెండ్ల: చెత్త నుంచి సంపద సృష్టిస్తే గ్రామ పంచాయతీలకు అదనపు ఆదాయం సమకూరుతుందని ఎంపీపీ తలతోటి రాణి చెప్పారు. మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం నుంచి ఐదు రోజుల పాటూ జరిగే ఘనవ్యర్థాల నిర్వహణపై శిక్షణ కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. తొలిరోజు నాదెండ్ల మండల పరిధిలో జరిగిన శిక్షణ కార్యక్రమానికి సర్పంచ్ మొగిలి నాగలక్ష్మీ అధ్యక్షత వహించారు. మంగళవారం, బుధవారాల్లో చిలకలూరిపేట, గురు, శుక్రవారం యడ్లపాడు మండల సిబ్బందికి శిక్షణ జరగనుంది. తొలిరోజు శిక్షణకు నాదెండ్ల మండల పంచాయతీ కార్యదర్శులు, గ్రామ గ్రీన్గార్డులు, క్లాప్ మిత్రాలు, ఉపాధి హామీ పథకం టీఏలు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామ స్థాయిలో పూర్తిగా చెత్త సేకరణ లక్ష్యంగా పనిచేయాలన్నారు. గ్రామస్తులు ప్రతిరోజూ సేకరించిన తడి, పొడి చెత్తతో పాటూ ప్రమాదకర చెత్తను వేర్వేరుగా విభజించి చెత్త సేకరించే సిబ్బందికి అందించాలన్నారు. ఇలా సేకరించిన చెత్తను డంపింగ్ యార్డుకు తరలించి వానపాముల ఎరువుల తయారీ, రీసైక్లింగ్ చేయాలన్నారు. వానపాముల ఎరువు, రీసైక్లింగ్ ద్వారా సేకరించిన వేస్ట్ను విక్రయిస్తే పంచాయతీలకు అదనపు ఆదాయం సమకూరుతుందన్నారు. అనంతరం చిలకలూరిపేట నియోజకవర్గ స్థాయిలో ఎంపికైన నాదెండ్ల ఘనవ్యర్థాల నిర్వహణ కేంద్రాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. శిక్షకులుగా పంచాయతీ కార్యదర్శులు మారుతీ బాబు, లక్ష్మీనారాయణ, కె.మధుబాబు, ఈవోపీఆర్డీ లక్ష్మీకుమారి వ్యవహరించారు.



నాదెండ్ల ఘన వ్యర్థాల కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంపీపీ రాణి, అధికారులు, సిబ్బంది

గంజాయి కేసులో నిందితుడి అరెస్టు

అమరావతి: గంజాయి కేసులో నిందితుడిని పోలీసులు అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచారు. మండల పరిధిలోని ధరణికోట గ్రామంలో ఈనెల 20వ తేదీ అరు డొంకల బావి సమీపంలోని పాత కోళ్ల ఫారం దగ్గర గంజాయి విక్రయిస్తున్నారని సమాచారం మేరకు దాడి చేశారు. పోలీసులను చూసి ఐదుగురు పారిపోయారు. సంఘటన ప్రదేశంలో నిందితులు వదిలేసిన 1.5 కేజీ గంజాయిని స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశారు. ఇందులో మూడో నిందితుడైన నర్రావుల తారక నరసింహా చౌదరిని స్థానిక గుంటూరు రోడ్డులోని ఆర్చి వద్ద విశ్వసనీయ సమాచారం మేరకు సోమవారం సీఐ అచ్చియ్య సిబ్బందితో అరెస్ట్ చేసి, కోర్టులో హాజరు పరిచారు. ఈ కేసులో ఇంకా నలుగురు పరారీలో ఉన్నారని, వారి కోసం ప్రత్యేక టీంలను ఏర్పాటు చేసి గాలింపు చర్యలు చేపడుతున్నామని అచ్చియ్య తెలిపారు.

ఎన్ఈసీలో ఎల్వైఎఫ్ చిత్ర బృందం సందడి

నరసరావుపేట రూరల్: లవ్ యువర్ ఫాదర్(ఎల్వైఎఫ్) చిత్ర బృందం నరసరావుపేట ఇంజనీరింగ్ కళాశాలలో సోమవారం సందడి చేసింది. శ్రీహర్ష, కషికాకపూర్ హీరో, హీరోయిన్లుగా ప్రముఖ గాయకుడు ఎస్పీ చరణ్ ముఖ్యపాత్రలో నటించిన ఈ సినిమా ఏప్రిల్ 4వ తేదీన ప్రేక్షకుల ముందుకు రానుంది. మూవీ ప్రమోషన్లో భాగంగా హీరో శ్రీహర్ష, చిత్ర బృందం కళాశాలకు విచ్చేశారు. విద్యార్థులతో సెల్ఫీలు దిగి సందడి చేశారు. ఈ సందర్భంగా హీరో శ్రీహర్ష మాట్లాడుతూ తండ్రి, కొడుకుల మధ్య ఉండే అనుబంధంపై సినిమా రూపొందించడం జరిగిందని తెలిపారు. ప్రతి ఒక్కరు సినిమా చూసి విజయవంతం చేయాలని కోరారు.



విద్యార్థులతో సందడి చేస్తున్న హీరో శ్రీహర్ష

కార్యక్రమంలో సినిమాలో నటించిన బంటి, శ్రీధర్, కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్న ట్రాలీ.. ఒకరి మృతి



వెల్దుర్తి: నిలిచి ఉన్న ద్విచక్ర వాహనాన్ని ట్రాలీ ఆటో వేగంగా వచ్చి ఢీ కొట్టడంతో ఒకరు మృతి చెందగా మరొకరికి తీవ్ర గాయాలైన ఘటన సోమవారం జరిగింది. శిరిగిరిపాడు గ్రామానికి చెందిన ఈదర అశోక్ రెడ్డి (29), బోయ వెంకట రెడ్డి మరికొందరితో కలిసి వెల్దుర్తి – శిరిగిరిపాడు గ్రామాల మధ్య పొగాకు ట్రాలీ ఆటోకు ఎత్తేందుకు కూలీ పనికి వెళ్లారు. అక్కడ పని ముగించుకొని వేరొక చోటకు వెళ్లేందుకు పై ఇద్దరు ద్విచక్ర వాహనం వద్ద నిలుచున్న సమయంలో పొగాకు ఎత్తుకున్న ట్రాలీ వేగంగా వచ్చి వీరిద్దరినీ ఢీకొట్టింది. దీంతో వారు తీవ్ర గాయాలపాలయ్యారు. తోటి కూలీలు హుటాహుటిన ప్రైవేటు వాహనంలో వీరిద్దరిని మాచర్ల ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా మార్గమధ్యలో అశోక్రెడ్డి మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. గాయపడిన బోయ వెంకటరెడ్డిని మాచర్ల ప్రభుత్వ వైద్యశాలలో ప్రథమ చికిత్స అందించారు. బాధితుల ఫిర్యాదు మేరకు వెల్దుర్తి పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ముస్లింలకు వైఎస్సార్ సీపీ అండగా ఉంటుంది

పిడుగురాళ్ల: ముస్లిం సోదరులకు వైఎస్సార్సీపీ ఎప్పుడు అండగానే ఉంటుందని గురజాల మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్రెడ్డి అన్నారు. మండలంలోని వీరాపురం గ్రామంలో సర్పంచ్ విజయరామరాజు ఆధ్వర్యంలో ముస్లిం సోదరులు ఇస్తార్ విందు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్రెడ్డి పాల్గొన్నారు. ముస్లింలకు అత్యంత ప్రాధాన్యత కల్పించే ప్రభుత్వం వైఎస్సార్ సీపీ మాత్రమేనన్నారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర వైద్యుల అధికార ప్రతినిధి డాక్టర్ చింతలపూడి అశోక్కుమార్, అల్లు పిచ్చిరెడ్డి, ముస్లిం సోదరులు తదితరులు పాల్గొన్నారు.



ఇఫ్తార్ విందులో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్రెడ్డి

దుక్కులకు ఇది అనుకూల సమయం

రెంటచింతల: సాగు భూములలో దుక్కులు దున్నుకునేందుకు ఇదే అనుకూలమైన సమయమని మండల వ్యవసాయాధికారి బోయపాటి బ్రహ్మారెడ్డి అన్నారు. సోమవారం స్థానిక మండల వ్యవసాయ కార్యాలయంలో వీఏఏలకు నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామాలలోకి వెళ్లిన వీఏఏలు వేసవిలో పంట పొలాల్లో దుక్కులను వాలుగా లోతుగా దున్నుకోవాలని, లేకపోతే వర్షపు నీటికి భూమి కోతకు గురయ్యే ప్రమాదం ఉందని రైతులకు వివరించాలన్నారు. ఖరీఫ్, రబీ సీజన్లలో పంటలు వేయడం వల్ల చీడపీడలు భూమిలో ఉంటాయని వేసవిలో దుక్కులు దున్నడం వల్ల భూములలో ఉండే క్రిమికీటకాల తోపాటు చీడపీడలు ఎండలకు చనిపోతాయని తెలిపారు. ఈ సమావేశంలో వీఏఏలు నరమాల వెంకటేష్, గొంటు కృష్ణారెడ్డి, నక్కా జయశ్రీ, చల్లా సతీష్రెడ్డి, ఆవుల జగన్ గోపికృష్ణ, కామిరెడ్డి శ్రీలత, కె. విజయ్కుమార్ తదితరులున్నారు.



మాట్లాడుతున్న ఏఓ బోయపాటి బ్రహ్మారెడ్డి

ఇంజినీరింగ్ ప్లాన్ పరిశీలనకు వినతి

మాచర్ల రూరల్: పట్టణంలోని నెహ్రూ నగర్ ప్రజానీకం దాహార్తిని తీర్చేందుకు ఇంజినీరింగ్ నైపుణ్యంతో రూపొందించిన ప్లాన్ ను పరిశీలించి, తగు నిర్ణయం తీసుకోవాలని ఇంజినీర్ ఆవుల వెంకట వీరాంజనేయులు, వీరారెడ్డి, కొండలు కోరారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వినతి పత్రం అందజేశారు. పట్టణంలో సగానికి పైగా ఉన్న నెహ్రూ నగర్ ప్రాంతంలో నీటి కొరత ఎక్కువగా ఉందని, తాము రూపొందించిన నివేదిక ప్రకారం నీటిని నిల్వ చేసుకునేందుకు దాహార్తిని తీర్చేందుకు ఉపయోగపడుతుందని చెప్పారు. అలాగే కొప్పునూరుకు చెందిన వెంకటేశ్వరరెడ్డి తన పొలానికి సంబంధించి అడంగల్ మార్పులుపై, జెట్టిపాలెం వెంకటేష్ పేదల నివేశన స్థలాల కొరకు, అలాగే మరో రెండు అర్జీలు అందినట్లు తహసీల్దార్ బి.కిరణ్కుమార్ తెలిపారు.



తహసీల్దార్కు అర్జీ అందజేస్తున్న అంజి, వీరారెడ్డి

బీఎల్వోల వేతనాలు చెల్లించాలి

దాచేపల్లి : వేతనాలు చెల్లించాలని తహసీల్దార్ కేవీ కుటుంబరావుని బీఎల్వోలు కోరారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ఆయన్ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఎన్నికల సంబంధించిన అన్ని పనులు తమతో చేయించారని, ఎంతో కష్టపడి తాము పనిచేస్తే గౌరవ వేతనాలు ఇంత వరకు చెల్లించలేదని వారు అవేదన వ్యక్తం చేశారు. గౌరవ వేతనాలు ఇవ్వకపోవటం వల్ల తాము ఆర్థికంగా ఎన్నో ఇబ్బందులు పడుతున్నామని, తమకు గౌరవ వేతనాలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని వారు కోరారు. ఉన్నతాధికారులతో మాట్లాడి తదుపరి చర్యలు తీసుకుంటామని తహసీల్దారు కుటుంబరావు చెప్పారు.



తహసీల్దార్తో మాట్లాడుతున్న బీఎల్వోలు

అమరవీరుల త్యాగం చిరస్మరణీయం

సత్తెనపల్లి: అమరవీరుల త్యాగం మరువలేనిదని, చిన్న వయసులోనే దేశం కోసం పోరాడి అమరులైన భగత్సింగ్, రాజ్గురు, సుఖదేవ్ చిరస్మరణీయులని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కె. పద్మ కొనియాడారు. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గల స్కిల్ డెవలప్మెంట్ ట్రైనింగ్ సెంటర్లో గవర్నమెంట్ ఆఫ్ ఇండియా మై భారత్ యూత్ అఫైర్స్ అండ్ స్పోర్ట్స్, నెహ్రూ యువ కేంద్ర గుంటూరు సౌజన్యంతో హెల్ప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో షహీద్ దివాస్ (అమరవీరుల దినోత్సవం) సోమవారం నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పద్మ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. అమరవీరులను స్మరించడం ఎంతో పుణ్యఫలమన్నారు. స్కిల్ డెవలప్మెంట్ ట్రైనింగ్ సెంటర్ ఇన్చార్జ్ కృష్ణారెడ్డి మాట్లాడుతూ భరత జాతికి స్వేచ్ఛా జీవితాన్ని ప్రసాదించడానికి భగత్ సింగ్, రాజ్గురు, సుఖదేవ్ వీరోచిత పోరాటాలు చేసి యువ హృదయాలపై చెరగని ముద్ర వేశారని తెలిపారు. వారిని స్మరిస్తూ కార్యక్రమాన్ని హెల్ప్ ఫౌండేషన్ ఏర్పాటు చేయడం అభినందనీయమని తెలిపారు. హెల్ప్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు కంచర్ల బుల్లిబాబు మాట్లాడుతూ అమర వీరుల త్యాగాన్ని స్ఫూర్తిగా తీసుకొని యువత ఉన్నతమైన ఆలోచనలతో ముందుకు కదలాలని సూచించారు. ముందుగా భగత్ సింగ్, రాజ్ గురు సుఖదేవుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో టీచర్ మస్తాన్, ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ రమేష్ బాబు, స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ ట్రైనర్ మీరాబీ, విద్యార్థిని, విద్యార్థులు, ఉన్నారు.



మాట్లాడుతున్న ప్రిన్సిపల్ పద్మ

మానసిక ఆరోగ్యానికి ధ్యానం దోహదం

సత్తెనపల్లి: ధ్యానం మానసిక ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుందని తట్టవర్తి రాజ్యలక్ష్మి అన్నారు. పట్టణంలోని శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవస్థాన కల్యాణ మండపంలో పిరమిడ్ స్పిరిచువల్ సొసైటీస్ మూమెంట్ ఆధ్వర్యంలో సోమవారం ధ్యాన ఆత్మజ్ఞాన శిక్షణ శిబిరం నిర్వహించారు. తట్టవర్తి రాజ్యలక్ష్మి మాట్లాడుతూ ఒత్తిడిని తగ్గించడంలో ధ్యానం సహాయపడుతుందని తెలిపారు. దృష్టిని మెరుగు పరుస్తుందని, స్వీయ అవగాహనను పెంచుతుందని చెప్పారు. వ్యాధులను నిరోధించడంలో సహాయ పడుతుందని పేర్కొన్నారు. ధ్యానం చేయడంలో మెలకువలు, దాని వల్ల వచ్చే ప్రయోజనాల గురించి ఆమె వివరించారు. ప్రతి రోజు 15 నిమిషాలు ధ్యానం చేసి జీవితంలో మార్పులు చూడాలని సూచించారు. కార్యక్రమంలో రామకృష్ణ పిరమిడ్ సొసైటీ నిర్వాహకులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న తట్టవర్తి రాజ్యలక్ష్మి

మార్కెట్ల నిర్వహణ వేలం.. రూ.13.67 లక్షల ఆదాయం

మాచర్ల : మాచర్ల పురపాలక సంఘం 2025–26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి కూరగాయల మార్కెట్, సండే మార్కెట్, జంతు వధశాల (మాంసం మార్కెట్) మునిసిపల్ కార్యాలయంలో బహిరంగ వేలం నిర్వహించినట్లు మున్సిపల్ కమిషనర్ డి.వేణుబాబు సోమవారం తెలిపారు. కూరగాయల మార్కెట్ ను రూ.6.11 లక్షలు, సండ్రి మార్కెట్కు రూ.6.43లక్షలు, మటన్ మార్కెట్ ను రూ.1.12 లక్షలకు పాట పాడుకున్నట్లు తెలిపారు. పురపాలక సంఘానికి రూ.13.67 లక్షలు ఆదాయం వచ్చినట్లు వెల్లడించారు.